# అందని మేఘాలు

ఆకాశంలో తొలకరి మబ్బులు తొంగిచూస్తున్నాయి. చల్లగా మెల్లగా సాగిపోతున్న పిల్లగాలి మల్లె, మాలతుల పరిమళాన్ని క్రమంతప్పక ఇంటింట పంచుకుపోతున్నది. దూరాన రేడియో తీయగా, హాయిగా పాడుతున్నది. వీధులలో విద్యుద్దీపాలు వరుసలు తీరి బారులుగా కూర్చిన ముత్యాల తోరణాలలా మెరిసిపోతున్నాయి.

చక్కని పరిసరాలు, ఆనందకరమైన ప్రకృతి, ఆకాశంలో మబ్బులతో దోబూచులాడే జాబిల్లి ఇవన్నీ కలిసి కూడా డాబా గోడకానుకొని తదేక దీక్షతో దేనికోసమో ఎదురు చూస్తున్న రాధ మనోభావాలను కదల్ప లేక సిగ్గుతో తలవొంచాయి.

జ్ఞాపకాల పుటలలో కాలంతో. కలసి పయనించి, చినికి, జీర్ణించిన పంక్తులలో అక్షరాలను ఆతృతగా ఏరుకొంటున్నది రాధ. కన్ను చెమర్చే, మనసు నోదార్చే మాటలకోసం. నేడు శూన్యమయితే, నిన్న తలచి సంతోషించు, రేపుకోసం నిరీక్షించు అంటారు ఆశావాదులు. నేడు, నిన్న, రేపులలో భేదమే లేకుంటే, అన్నీ కలసి సమిష్టిగా ఎదురుదెబ్బ తీస్తే తట్టుకొనే మార్గం ఏమిటి? వీటినుండి తప్పుకొనగలిగేవారు ఎంతమంది?

చిన్నప్పటినుంచి నీ తత్వమే ఇంత, ఏదో కారణకార్యాలనూహించి అనవసరంగా నువ్వు బాధపడ్తావు, ఇతరులను బాధపెడ్తావు" అంటుంది అమ్మ.

బాధపడడం, సుఖించడం అన్నవి మనుష్యుల మనస్తత్వాలపై ఆధారపడి ఉంటాయి. ఎంతటి కష్టాలలోనైనా మనసు నరికట్టి, చిరునవ్వు నవ్వగల్గేవారు లేకపోలేదు. అలాగే ఏ చిన్నతాకిడికీ తట్టుకోలేక, చిగురాకులా అల్లాడిపోయేవారు కోకొల్లలు. కష్టాలు అన్నదానికి నిర్వచనం చెప్పబోవడం అంత సులువయిన పనికాదు. ఒకరి దృష్టిలో వేదనగా పరిణమించిం దింకొకరికి అల్ప విషయంగా తోచవచ్చు. నిరుపేద తినేందుకు తిండి, ఉండేందుకు ఇల్లు లేక కష్టపడుతుంటే, ధనవంతుడు తన ధనాన్ని ఖర్చు పెట్టేందుకు దారితోచక బాధపడతాడు.

ఇంక చిన్న పిల్లల వేదనలు పెద్దలకు నవ్వుపుట్టిస్తూ ఉంటాయి. వారి బుద్ధికి అందని ప్రతిచిన్న కదలికా వారికి సమస్యే. ఎన్నో తీరని సందేహాలతో బాధపడుతుంటారు. అమ్మనో, అమ్మమ్మనో వేధించి, జవాబు పొందేవరకు వారికి తోచదు.

అది వేసవికాలం. రాధ, అమ్మమ్మ ఒడిలో తలవుంచి ఆకాశం వైపు చూస్తున్నది.

"డాబాపై కూడ గాలన్నమాటలేదు. ఏం ఎండలు, ఏం ఎండలు" అంటూ అమ్మమ్మ విసనకర్ర అందుకుంది.

"ఉండమ్మమ్మా! కొంచెంసేపు విసరకు" అంది రాధ.

"ఏం. ఉక్కగా లేదుటే" అని ప్రశ్నించింది అమ్మమ్మ ఆశ్చర్యంగా. అమ్మమ్మ మాట రాధకు వినిపించలేదు. ఆ మేఘం లేడిలా ఎంత చక్కగా వుంది! కొమ్ములూ, తలా, కాళ్ళు, అచ్చు నిన్న సర్కసులో చూసిన లేడిలా ఉంది. అలా తొందరగా ఎందుకు పారిపోతున్నది? వెనుకనుంచి పులి వస్తున్నదా? లేదు. చెవుల పిల్లి వస్తున్నది. అదీ పరుగెదుతున్నది ఎందుకో.

"అమ్మమ్మా"

"ఏం రాధా?"

"మేఘాలన్నీ ఎక్కడికి పోతున్నాయి?"

"దేవుడి దగ్గరకమ్మా, దేవుడు వాటన్నిటినీ కూడబెట్టి మనకు వర్షం ఇస్తాడు."

"మనమే ఎందుకు కూడబెట్టుకోకూడదు అమ్మమ్మా? చక్కగా నా బుల్లి పెట్టె నిండా పోసుకుని ఆడుకుందును కదా." .

"ఆ మేఘాలు మనకి అందవమ్మా, అవి అలా దూరంగా మనల్ని ఊరిస్తూ ఆకాశం మీద పరుగులు తీస్తాయి. దగ్గరకొస్తే అంతా ఆవిరి, పొగ. ఏముంటుంది అందులో."

ఆనాడు అందని మేఘాల గురించి బాధపడింది రాధ. ఒక్క మేఘాలే కాక జీవితంలో దూరం నుంచి ఊరించి అందీ అందకుండా తప్పుకుపోయేవి అనేకం వుంటాయని ఆమెకి తెలియదు.

◆ ◆ ◆

సుబ్బయ్య ఇంటిలోంచి హార్మోనియము "సరిమాగరి" అంటున్నది. పంకజం బొంగురు కంఠంతో "లంబోదర" అంటున్నది. ఏ మాత్రం సంగీతం పరిచయమున్న వాళ్ళయినా ఆ అపస్వరం, ఆ గొంతు వినలేక చెవులు మూసుకోవలసినదే. సుబ్బయ్య మాత్రం తన కూతురి పాట విని పొంగిపోతాడు.

"అమ్మా, నాకు సంగీతం చెప్పించవే" రాధ ప్రాధేయంగా అడిగింది తల్లిని. అంత చిన్న వయసులో కూడా తన కోర్కె తీరేది కాదేమో అన్న సంశయము ఆమెను తల్లి దగ్గర ప్రాధేయపడేలా చేసింది. రాధకి తన సంసారం గురించి కొంతవరకు తెలుసు. తండ్రికి వచ్చే కొద్దిపాటి జీతంతో సంసారం గడవాలి. తల్లి ఎంత కప్పుదామన్నా ఆ వెలితి కనిపిస్తూనే ఉండేది. పండుగలకు తోటి పిల్లలు కొత్త పరికిణీలు "ఫ్రాకులు" తొడుక్కుని తిరుగుతుంటే, ఇంటిలో ఉతికిన పరికిణీ కట్టుకుని "నాదీ కొత్తదే" అని దబాయించేది తోటిపిల్లలను. రామనాథంగారి సంసారం గురించి ఆ చుట్టు ప్రక్కల అందరికీ తెలుసు. రాధ మాటలకు తోటిపిల్లలు పగలబడి నవ్వి ఇప్పుడే మీ నాన్న తెచ్చాడు కదూ అనేవారు. ఆటలు మాని కళ్ళనీళ్ళతో రాధ ఇంటికి తిరిగి వచ్చేది.

"అమ్మా, ఏమంటావమ్మా?" రాధ హెచ్చరించింది.

"అలాగేనమ్మా, వచ్చే నెల నుంచి నేర్చుకొందువుగాని" అంది తల్లి. ఆ వచ్చేనెల ఎప్పటికీ ఈ నెలగా మారదని రాధ తల్లికి తెలుసు.

చిన్నారి రాధ మాత్రం తాను వచ్చే నెల నుంచి సంగీతం నేర్చుకుంటానని తన నేస్తురాళ్ళకి చెప్పింది. అంతా మరొకసారి గుసగుసలాడారు. ఈసారి రాధ కళ్ళనీళ్ళు నింపుకోలేదు. "నేర్చుకున్నప్పుడు చూస్తారుగా" అంది ఉక్రోషంతో.

◆ ◆ ◆

పెళ్ళిపీటలమీదున్న కూతుర్ని, అల్లుణ్ని చూసి కళ్ళొత్తుకున్నారు రామనాధం దంపతులు.

"నువ్వు అదృష్టవంతురాలివి రాధా" అంది తల్లి.

"నీ మొగుడు దేవుడిలాటి వాడమ్మా" అన్నాడు తండ్రి.

"చదువుకున్న కుర్రాళ్ళంతా ఇలా కట్నాలు తీసుకోమంటే" అనుకున్నారు అమ్మలకన్న అయ్యలు.

"అల్లుడేం చదువుతున్నాడమ్మా" ప్రశ్నించిందో ముత్తయిదువు.

"ఇంటరు పాసయ్యాడు. డాక్టరు చదువుతాడట" అంది రాధ తల్లి గర్వంగా.

ఒక్కక్షణం తలపైకెత్తి చూసింది రాధ "నిజంగానా" అన్నట్లు.

"మరేమనుకొన్నావు" కళ్లతోనే జవాబు చెప్పాడు పెళ్ళికొడుకు.

రాధ మనసు ఆనందంతో నిండిపోయింది. డాక్టర్లంటే అందరి లాటివారు కారని రాధకి చిన్నతనంనుంచి ఓ అభిప్రాయం.

ఆపత్సమయాలలో వాళ్లు దేవుళ్లలా కనిపిస్తారు. అందరికీ డబ్బుంటుందా వైద్యం చేయించుకోను? డాక్టరు నిర్దయుడైతే ఎంతోమంది పేదలు తమ ఆత్మీయుల్ని కోల్పోవలసి వస్తుంది. తన రాజు అలాటివాడు కాదు. అతను ఉచితంగా మందులిస్తాడు. తాను రోగులకు సేవచేస్తూ అతనికి సహాయ పడ్తుంది. తనకి చదువే ఉంటే...

"ఒదినా, నువ్వు ఏం చదువుకొన్నావు?" మరదలుపిల్ల ప్రశ్నతో రాధ సిగ్గుతో బుర్ర వంచుకుంది.

"అన్నయ్య నిన్ను చదివిస్తాడట. అమ్మతో చెప్తున్నాడు."

"అంత అదృష్టమా" అనుకుంది రాధ తనలో.

◆ ◆ ◆

"మెడిసిను చదువుతానన్నారుగా" అని ప్రశ్నించింది రాధ.

"నిజమే. అనుకొన్నానుగాని, నాన్న ఒప్పుకోవటం లేదు. దూరం పో వద్దంటుంది అమ్మ. ఏం చెయ్యడం? పోనిద్దూ నా మట్టుకు ఏదైనా ఒకటే. రాణించగల్గితే దేనిలోనయినా రాణించవచ్చు. ఇంతకీ నీకేం పట్టింపులేదు కదా?" అన్నాడు రాజు.

"నా కేం పట్టింపు ఉంటుంది" అంది రాధ.

"ఏమో! డాక్టరుగారి భార్య నవాలని ఉందేమో అని" అన్నాడు నవ్వుతూ.

నిజానికి తను అనుకొన్నట్లు జరుగకపోయేసరికి బాధపడింది రాధ. కాని తన మనోభావాలను మనసులోనే నిల్పుకునే అలవాటు రాధకు ఉగ్గు పాలతోపుట్టింది. ఏ విషయంలోను వెలితిపడకపోవడమే రాధ ప్రత్యేకత.

ఆ వెనుక రెండేళ్ళనాడు, పరీక్షకు వెళ్ళవద్దని అత్తగారు అన్న నాడు కూడా రాధ నోరెత్తలేదు.

"చదువు చెప్పించావు బాగానేవుంది కాని, ఈ సమయంలో దానిని పరీక్షకు పంపటమేమిటిరా? ఎవరైనా వింటే నవ్విపోగలరు. ఏడో నెల వచ్చిందాయె, వాళ్ళమ్మ వచ్చి నేడో, రేపో పురిటికి తీసుకు వెళ్తానంటూంటే" అంది రాధ అత్తగారు.

"అత్తయ్య మాటే కానిద్దురూ, ఇప్పుడు ముంచుకుపోయిందేముంది? చదివిన చదువు ఉత్తినే పోదు. పరీక్షపాసయ్యే యోగముంటే ఇంకోనాడు వెళ్ళొచ్చు" అన్నది రాధ నిర్లిప్తంగా.

◆ ◆ ◆

"చూడమ్మా రాధా. పాప ఎంత బాగుందో" అంది తల్లి.

రాధ బరువుగా కళ్ళు తెరిచింది.

"అబ్బాయా? అమ్మాయా?" అమ్మమ్మ ప్రశ్నించింది.

"అమ్మాయే. ఏ పిల్లయితేనేం, దాని బరువు చులకనపడింది" అన్నది అమ్మ సంతోషంతో.

నిజానికి ఏ పిల్లయినా తల్లికి ఒక్కటే. అందులోనూ ప్రథమ సంతానం కూతురా, కొడుకా అని ఆలోచించరు. అందంగా, ఆరోగ్యంగా పిల్ల ఉంటే చాలు.

కాని, రాధ విషయంలో అలాకాదు. తాను తల్లికాబోతున్నానని తెలిసిన దగ్గర నుండి తనకి కొడుకే పుడతాడనుకొనేది. రాజుతో ఆ విషయంలో పంతాలు కూడా వేసేది. మరికొన్ని నెలల్లో పుట్టబోయే కొడుకు రూపురేఖలు తల్చుకు మురిసిపోయేది. తన ఆలోచనలన్నీ తారుమారు అయ్యాయని తెలిసి నిట్టూర్చింది రాధ.

నామకరణం చేస్తూ "నీ కొడుక్కి ఏం పేరు పెట్టేది రాధా" అన్నాడు రాజు కొంటెగా.

రాధ కోపంగా చూసి, ఇంకెవరూ వినలేదు కదా అని సర్దుకొంది.

◆ ◆ ◆

రాధ నలుగురు పిల్లల తల్లి అయింది. పెద్దకూతురు మాధవికి ఎనిమిది ఏళ్లు. తరువాతవాడు రవి. రవికి, బాబుకి మూడేళ్ళు తేడా. కడసారపు ముద్దులపట్టి సీత.

సాయంకాలం అయిదు గంటలకి రాజారావు కాలేజీనుండి ఇంటికొచ్చే సరికి, ఇంట్లో వయొలిను సరిగమలు పల్కుతున్నది. ఏమిటా విశేషం అని గదిలోకి తొంగిచూశాడు

రాజు. ఒక చాపమీద మాధవి ఎదురుగా నలభై ఏభై ఏళ్ళ వయస్సులో వున్న నూతన వ్యక్తి కన్పించారు.

వెనుకనుంచి కాఫీ కప్పుతో వచ్చిన రాధ రాజు ఆలోచనలని ఆపు చేసింది.

"మాధవి సరదా పడుతూంటే రామయ్యగార్ని పిలిపించాను.

"ఏదో చిన్నపిల్ల నేర్చుకుంటుంది. ఇంతకి మహా ఎంత అయిపోతుంది కాబట్టి, నెలకి పదిరూపాయలిస్తే చాలన్నారు ఆయన. వయొలిను కూడా ప్రస్తుతం కొనక్కరలేదట. తనది తెస్తానన్నారు" అన్నది.

"మంచిపనే చేశావు. ఈ రోజుల్లో ఆడపిల్లకి చదువు, పాట అన్నీ ఉండవలసిందే" అన్నాడు రాజు.

అయిదారు నెలలు గడిచిపోయాయి. ఆ రోజు సాయంకాలం రామయ్యగారు కొంచెము ఆలస్యంగా వచ్చారు. మాధవి ఏ సందునుంచో చల్లగా జారుకుంది ఆటలకి.

"అమ్మా మాధవీ" అని పిల్చారు రామయ్యగారు.

రాధ కూడ పిల్చి చూచింది. మాధవి అలికిడి లేదు.

"అమ్మా, మీరు ఏమీ అనుకోనంటే ఒక్క మాట చెప్తాను" అన్నారు రామయ్యగారు.

"మీ డబ్బుని వ్యర్థపుచ్చుటం నా కిష్టం లేదమ్మా. మాధవికి సంగీతమంటే అభిరుచి లేదు. చిన్నపిల్ల, కొంతకాలం అయితే అదే కుదురుతుందని చూశాను. ఇంతకీ ఇది పుట్టుకతో రావలసిన విద్యమ్మా" అన్నారు నమ్రతగా.

"అంతే అంటారా మాస్టారూ" అంది రాధ బాధగా.

ఆమె ముఖం చూస్తూనే రామయ్యగారు ఆశ్చర్యపోయారు. "మీకు వంట్లో కులాసాగా లేదా అమ్మా? అలా మంచంమీద కూర్చోండి" అన్నారు ఆతృతగా.

'మరేం ఫరవాలేదు బాబూ. నిన్న కార్తిక పూర్ణిమ కదా, ఉపవాసమున్నాను. కాస్త ముఖం తిరిగింది. ఇప్పుడు బాగానే వుంది. మీరు వెళ్ళిరండి బాబూ" అంది.

◆ ◆ ◆

పిల్లలు పెద్దవాళ్ళయ్యారు. మాధవికి మంచి వరుని చూచి వివాహం చేశారు. రవి బి.యస్సీ పూర్తి చేశాడు. బాబు పి.యు.సి. చదువుతున్నాడు. సీత ఎనిమిదో క్లాసులోకి వచ్చింది.

నిండుకుండలా జీవితం ఒడుదుడుకులు లేకుండా సాగిపోతున్నది. ఆ ఇంట్లో రాధ మాటంటే, రాజు దగ్గర నుంచి చిన్నపిల్ల సీతదాకా అందరూ మన్నిస్తారు. అదృష్టం అంటే రాధదే అనేవారు తెలిసినవారంతా. నిజంగా రాధకే విషయంలోను కొరతలేదు. తన

ప్రాణంకన్న అధికంగా చూసుకొనే భర్త, అభిమానంతో అలరించే పిల్లలు, అన్నోదకాలకి లోటులేని సంసారం. ఏ ఆడదానికైనా అంతకన్నా కావలసిందేమిటి?

అయినా ఏదో వెలితి రాధని ఏనాడూ వదిలిపెట్టలేదు. అది కొన్ని సమయాల్లో వెనుకపడినా తిరిగితిరిగి పైకి లేచేది. తను ఊహించినదానికి ఏమాత్రం భిన్నంగా జరిగినా బాధపడేది రాధ. తొందరగా వచ్చేస్తానన్న రాజు రావటం ఒక గంట ఆలస్యమయితే ఆరాటపడేది. వస్తానన్న వేళకి రాకపోవడంలోనే, తమ స్వతంత్రత తెలియజేసుకోవాలనుకొంటారు ఈ మగవారు. ఇంట్లో ఇల్లాలుపడే ఆరాటం వారికి తెలిసిరాదు" అనుకొనేది. వయస్సు ముదురుతున్నకొద్దీ సంసారంపట్ల నిర్లిప్తంగా వుండి, కృష్ణా, రామా, అనుకోక ఈ అకారణ అహంకార, మమకారాలు దేనికి? అందరూ తన మాటే వినాలని, అన్నీ తను ఆశించిన రీతిగానే జరగాలని ఎందుకనుకోవాలి? ఎవరి వ్యక్తిత్వం వారికుంటుంది. అందరూ తన ఇష్టప్రకారమే ఎందుకు నడవాలి" అని తనని తాను సముదాయించుకో చూసేది.

రవి బి. యస్సీ ఫస్టు క్లాసులో పాసయ్యాడు.

"మెడిసిన్ చదవకూడదురా రవీ?" అన్నది రాధ.

"ఎమెస్సీ చదువుదామనుకొంటున్నానమ్మా" అన్నాడు రవి.

"ఎమెస్సీ చదివి ఏం చేస్తావు? మళ్ళా అయ్యవారి పనేకదా. చక్కగా డాక్టరువవుతే ఎంత పేరు, ప్రఖ్యాతి, ఎంతమందికి సహాయపడొచ్చు" అంది తాయిలం చూపించి చిన్నపిల్లాడిని ఊరిస్తున్నట్లు రాధ.

"అయ్యవారిపనంటే అంత చులకనన్నమాట నీకు. మరి ఆ అయ్యవారితో ఇంతకాలం ఎలా వేగుకువచ్చేదో పాపం" అన్నాడు రాజు.

"చాల్లెద్దురూ! ఏళ్లు ముందుకిపోతుంటే మరీ చిన్నవారవుతున్నారు, ఎదురుగా పిల్లలున్నారనేనా లేదు" అంది విసుగ్గా రాధ.

రవి మాట్లాడకపోవడంతో "ఏమంటావు రవీ" అని తిరిగి తనే ప్రశ్నించింది రాధ.

"నాకు మెడిసిన్ చదవాలని లేదమ్మా" అన్నాడు రవి నిశ్చలంగా.

రాధ భారంగా నిట్టూర్చింది.

రాధ ముఖంలోని మార్పును రాజు గమనించాడు. "ఇంకా టైము వుందికదా, వాడిని ఆలోచించుకోనీ" అన్నాడు ఆ ప్రసంగాన్ని అంతటితో ఆపుచేస్తూ.

రవి కాలేజీలో చేరవలసిన రోజు వచ్చింది. అతడికి మెడిసిన్‌లో కూడా సీటు వచ్చింది. బండిలో కాలు పెట్టేవరకు రాధ బోధిస్తూనే వుంది. మెడిసిన్‌లో వున్న మంచిచెడ్డలు. రాధ ఆవేదన రాజు గమనించకపోలేదు.

"నేను వాడికి నచ్చచెప్తాగా" అన్నాడు ఓదార్పుగా.

స్టేషనుకు వెళ్ళిన రాజు తిరిగి వచ్చేవరకు రాధ అలాగే బొమ్మలా గోడకానుకొని నిల్చింది. అలా ఎంతసేపు నిల్చుందో ఆమెకే తెలియదు.

◆ ◆ ◆

రాజు మృదుహస్తం ఆమెను ఈ లోకంలోకి తెచ్చింది. "రాధా" అన్నాడు రాజు ఆప్యాయంగా. ఆ స్వరంలో ఆవేదనా, నిస్సహాయతా మిళితమయి ఉన్నాయి. రాజు ముఖంలోకి ఒక్కసారి చూసింది రాధ.

ఆకాశంలో మబ్బులు పలుచనై, దూదిపింజల్లా దూరదూరంగా పరుగులు పెడుతున్నాయి. మానవ జీవితంలో ఆ మేఘాల్లాగే కన్పించి ఊరించి, దూరదూరంగా తొలగిపోయే అవకాశాలు అనంతం. వాటినన్నిటిని ఉపయో గించుకోగలమనుకోవటం మన అవివేకాన్ని మాత్రమే తెలియజేస్తుంది.

అనంతాకాశంలో తేలియాడే తెలిమబ్బులను అందుకోలేకపోయామని బాధపడడం ఎంత అసమంజసమో, ఆశించినవన్నీ సమకూరలేదని మథన పడడం కూడ అంత అవివేకమే.

ఆరేళ్ళ రాధ అందని మేఘాలని తన పెట్టెలో నింపుకుందామని ఆశించింది. నలభై ఏళ్ళ రాధ తన తీరని కోర్కెలను తన బిడ్డలద్వారా తీర్చుకొందామని తలచింది. రెండూ ఆమె దృష్టిలో అందని మేఘాలే అయ్యాయి.

"ఆ మేఘాలు మనకి అందవు. అవి అలా దూరంగా మనల్ని ఊరిస్తూ ఆకాశంలో పరుగులుతీస్తాయి. దగ్గరికివస్తే అంతా పొగా, ఆవిరి. ఏముంది అందులో అనుకొంది రాధ.